మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## చెట్ల లెక్క తేలలె..

తొలగించినవి ఎన్ని..
చర్యలు ఏవి..
మూడు రోజులైనా వివరాలు
తెలుపని అధికారులు



జీనుగురాల పల్లెప్రకృతివనంలో చెట్లను తొలగించిన దృశ్యం

3



డీఎల్ఎమ్ఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## లక్ష్యాలను సాధించాలి

**డీఎల్ఎమ్ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డిసిసిబి) బ్యాంక్ అభివృద్ధి ప్రణాళిక లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్,జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మహబూబ్‌నగర్, పర్సన్ ఇన్‌చార్జ్ విజయేందిర బోయి అన్నారు. మంగళ వారం డీసీసీబీ మహబూబ్‌నగర్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన డీఎల్‌ఎమ్ఆర్‌సీ (డిఎల్ఎంఆర్‌సి) సమావేశానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పర్సన్ ఇంచార్జి , కమిటీ సభ్యులతో బ్యాంక్ అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక (బ్యాంక్ డెవలప్‌మెంట్ యాక్షన్ ప్లాన్ బ్యాంక్ డిఎపి)లోని ముఖ్య అజెండా అంశాలను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జి)ను అనుసంధానం చేయాలని, బ్యాంక్ డీఏపీలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, అసమతుల్యతలను తగ్గించేందుకు పీఏసీఎస్ బ్యాంకులు, పీఏసీఎస్ జిల్లా సహకారఅధికారి అధికారీ (డిసిఓ) పరస్పరం సమన్వయంతో నెలవారీ సమీక్షలు నిర్వహిస్తూ పనిచేయాలని ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ డీఏపిలో సూచించిన లక్ష్యాలను సాధించి, సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశానికి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె. రవికాంత్ రెడ్డిజిల్లా సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్‌డీసీసీబీ నోడల్ ఆఫీసర్ ఎం. నిర్మల దేవి, డీజీఎం, టీజీసీఏబీ డీడీఎం, నాబార్డ్ పి.మనోహర్ రెడ్డి, బ్యాంక్ సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణ పేట, ఫిబ్రవరి 24ప్రభాతవార్త:** పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వి.సి. హాల్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు 25.02.2026 నుండి 16.03.2026 వరకు నిర్వహించబడతాయని చెప్పారు. పదవ తరగతి పరీక్షలు 14.03.2026 నుండి 16.04.2026 వరకు జరగనున్నట్లు తెలిపారు. ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం కలిపి 8,192 మంది విద్యార్థులకు 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్సి పరీక్షలకు 8,318 మంది విద్యార్థులు హాజరుకానుండగా 43 కేంద్రాలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్, చీటింగ్ నివారణకు ముగ్గురు అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హాల్ టికెట్ తప్ప ఇతర వస్తువులు అనుమతించబోమని, క్లోక్ రూమ్ సదుపాయం కల్పించినట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెక్షన్ 163 అమలు చేయాలని, జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల రవాణాకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాల్లో త్రాగునీరు, బెంచీలు, లైటింగ్, వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఉదయం 8:30 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ వినీత్ ృపాల్గొన్నారు.



## బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్**

**గద్వాల, ఫిబ్రవరి 24, ప్రభాత వార్త:** జిల్లాలో బాల్య వివాహాలు,బాల్య కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ఆదేశించారు. మంగళవారం – మిగతా4లో..

# బడుగులపై దాడులు సహించం

- కుమ్మెర ఘటనలో చిన్నారి మృతి విషాదకరం
- బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం
- తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



చిన్నారి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలపై దాడులు జరిగితే వాటిని సహించేది లేదని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కులను రక్షించడం కమిషన్ బాధ్యత అని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిందితులు ఎంతటి వారినైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. నాగర్ కర్నూల్ జిల్లా మండల పరిధిలోని కుమ్మెర గ్రామ శివాలయంలో ఈనెల 18న జరిగిన ఘటనపై రెండు నెలల చిన్నారి బలైపోవడం అత్యంత విషాదకరమని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్లు రాపోలు జయప్రకాశ్, టీ.సురేందర్, బాలలక్ష్మి ృ సభ్యులతో కలిసి రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ గ్రామాన్ని సందర్శించి ఘటన జరిగిన శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవాలయ వద్ద జరిగిన ఘటన ప్రదేశాన్ని సందర్శించి అక్కడ జరిగిన వివరాలను కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో చిన్నారి ఘటన జరిగిన పూర్వాపరాల వివరాలపై ఆరా తీశారు. ఘటన జరుగుతున్న సందర్భంగా హోంగార్డు చిత్రీకరించిన వీడియోను డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు వీడియోను ఫోన్లో కమిషన్ చైర్మన్‌కు చూపించారు. గ్రామంలో రెండు నెలల చిన్నారి సమాధిని సందర్శించి సమాధి వద్ద పూలు ఉంచి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. తదనంతరం చిన్నారి తల్లిదండ్రులు గణేష్ మౌనికల ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ మల్లన్న జాతరకు సుమారుగా 10,000 మంది భక్తులు వచ్చారని అధికారులు తమ దృష్టికి తెచ్చినట్లు ఆయన తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా మండల పరిధిలోని కుమ్మెర ఘటనను రాష్ట్ర బీసీ కమిషన్ అత్యంత ప్రాధాన్యత తీసుకున్నట్లు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, దేవాదాయ శాఖను పూర్తిస్థాయిలో నివేదికను సమర్పించాలని కోరినట్లు తెలిపారు. నివేదికలు అందిన తర్వాత ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ తరఫున సమగ్ర నివేదికను పంపనున్నట్లు కమిషన్ చైర్మన్ నిరంజన్ ఈ సందర్భంగా వెల్లడించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాల రాష్ట్ర బీసీ కమిషన్ అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. దోషులను ఎంతటి వారైనా చట్టపరంగా కఠినంగా శిక్షించాల్సిందేనని, పోలీసులు పారదర్శకంగా దర్యాప్తు చేసి నిజానిజాలను వెలికితీయాలని ఆయన ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కులవివక్షకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలని, సమాజంలో సమానత్వ భావన పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ గత మూడు రోజులుగా జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను రాష్ట్ర బీసీ కమిషన్ దృష్టికి వివరంగా తీసుకువచ్చారు.



బాధితులను పరామర్శిస్తున్న కమిషన్ సభ్యులు




సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు

## కులవివక్ష అంతమొందించాలి

- మానవత్వంతో నిర్వహించే పోరాటాలకు బీజేపీ అండ
- బాధితులపై కేసులు నమోదు హేయమైన చర్య
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి24 ప్రభాతవార్త:** మానవత్వంతో నిర్వహించే పోరాటాలకు బిజెపి అండగా నిలుస్తుందని రెండు నెలల పాప మృతి చెందడం దారుణమని అన్నారు. కుమ్మెర గ్రామంలో జరిగిన సంఘటనలో బాధితులపైనే పోలీసులు కేసులు నమోదు చేయడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని వైఫల్యాలను కట్టిపెట్టి న్యాయ విచారణ చేపట్టి దోషులను శిక్షించి బాధితులకు అండగా నిలవకపోతే శాసనసభలో తమ పార్టీ ఎమ్మెల్యేలు గళం విప్పుతారని బహిరంగ ప్రాంతాలలో కూడా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు అన్నారు మంగళవారం జిల్లా కేంద్రంలో పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కుమ్మెర సంఘటన నిరసిస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమాలకు నాయకులు కార్యకర్తలతో కలిసి తరలి వెళ్లి బాధిత కుటుంబానికి సంఘీభావం తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి దోషులను శిక్షించాలన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని ఇలాంటి సంఘటన జరిగిన పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి వద్దనే రక్షణ శాఖ ఉన్న దోషులను శిక్షించడంలో ఎందుకు నిరక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి, జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రంగౌడ్, కట్టా సుధాకర్ రెడ్డి, ఆనంద్ గౌడ్, భరత్ ప్రసాద్, సుజాత, చంద్రకళ, రమేష్ పాల్గొన్నారు.

# బీసీల ఎదుగుదలను ఓర్వలేకే దాడులు

- బీసీలకు అట్రాసిటీ బీసీ యాక్ట్ చట్టం తీసుకురావాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య




మీడియాతో మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో బీసీలు పెద్ద ఎత్తున గెలుపొందడంతో అగ్రకులాల వారు జీర్ణించుకోలేక ఇంత కురత్వంగా ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. బీసీల పట్ల ప్రభుత్వం నిరక్ష్య వైఖరి అవలంబిస్తుందని ఆయన ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గత ఐదు రోజులుగా కొనసాగుతున్న నిరసన కార్యక్రమానికి, ఘటన బాధితులను పరామర్శించడానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య తరలివచ్చి మద్దతు ప్రకటిస్తూ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలపై రాష్ట్రంలో అక్కడక్కడ జరుగుతున్నటువంటి దాడులను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టలేకపోతున్నారని అన్నారు. బీసీలకు అట్రాసిటీ బీసీ యాక్ట్ చట్టం తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేపించామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా బీసీ యాక్ట్ చట్టం తెస్తేనే ఈ రాష్ట్రంలో జరుగుతున్నటువంటి ఈ దాడులను నిలువరించడం సాధ్యమవుతుందన్నారు. ఈనెల 27న అన్ని జిల్లాలలో ధర్నాలు, దీక్షలు చేపడతామని అన్నారు. ఈ దాడి ఘటన విషయంలో ముఖ్యమంత్రి స్పందించాలని, బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దోషులపై భారత శిక్షాస్మృతి చట్టాలన్నీ ప్రయోగించాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని తల్లి కడుపుకోతను ఏ నాయకుడు, ఏ పార్టీ తీర్చలేరు" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన కారంచెడు, కల్వకోలు ఘటనలను గుర్తు చేస్తుందన్నారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దయ్య యాదవ్, పలువురు జిల్లా నాయకులు కాళ్ల నిరంజన్,కుంభం మల్లేష్ గౌడ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రేణునేష లక్ష్మయ్య, మూలింటి వెంకటేశ్వర్లు, సుధాకర్ గౌడ్, పబ్బతి శ్రీనివాసులు, నిరంజన్ యాదవ్, రామకృష్ణ గౌడ్, ఎండ్లబెట్ల రాజు, బాల పీరు, కాళ్ల చైతన్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.



రిజిస్టర్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్

## 14,857 బస్తాలు సిద్ధం

**జిల్లాలో యూరియా కొరత లేదు**

- ఇప్పటికే 3,07,550 యూరియా
- బ్యాగులు సరఫరా చేసాం
- మహబూబ్ నగర్ డీఏవో వెంకటేష్ వెల్లడి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్ తెలిపారు. మంగళవారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని ఎమ్మెస్ రాటి పర్టిలైజర్ షాప్‌ను అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా డిస్ట్రిబ్యూషన్ యాప్ ద్వారా ఏ విధంగా రైతులకు యూరియా సరఫరా చేస్తున్నారో పరిశీలించి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. రైతులు ఈ యూరియా యాప్ ద్వారా కొనుగోలు సులువుగా ఎటువంటి ఇబ్బందులు లేవని తమ సంతోషాన్ని తెలిపారు. గతంలో పనులు మానుకొని యూరియా – మిగతా4లో..

## నేడు నాగర్‌కర్నూల్‌కు కేటీఆర్

కుమ్మెర ఘటనలో బాధిత కుటుంబాలకు
పరామర్శించనున్న యువనేత
మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి వెల్లడి

3

## సంత స్థలం పేరిట దోపిడికి కుట్ర

- నైతికత ఉంటే మాట ప్రకారం సంత స్థలం ప్రభుత్వానిదే అని బోర్డు పెట్టాలి
- భూసేకరణ పేరిట నాటకాలెందుకు
- రాజకీయ లబ్దికోసం విషప్రచారం
- మాకు, ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** గత మూడు దశాబ్దాలుగా న్యాయస్థానంలో పెబ్బేర్ సంత స్థల వివాదం సర్వే నంబర్ 392 భూ యజమానులకు, దేవాదాయ శాఖకు మధ్య కొనసాగుతున్నదని పలుమార్లు భూ యజమానులకు వరుసగా 2003, 2007, 2022 సంవత్సరాలలో అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగిందని మంగళవారం పత్రికా సమావేశంలో నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయములో న్యాయస్థానాన్ని అతిక్రమించి రాజకీయ లబ్దికోసం ఎన్నికల సమయములో 30ఎకరాల 19 గుంటలు మొత్తం ప్రభుత్వానిదేనని ఇందులో నేను కబ్జా చేయడానికి కుట్ర చేస్తున్నాను అని నీచమైన,నిరదారణమైన ఆరోపణలు చేసి ఒక్కటంటే ఒక్క నెలలో సంత స్థలం మొత్తం ప్రభుత్వపరం చేసుకుంటామని బీరాలు పలికిన నాయకులు మూడేండ్లు గడుస్తున్నా నేటికి మాట నిలబెట్టుకోకుండా పోవడమే కాకుండా నేడు భూసేకరణ పేరిట భారీ దోపిడికి కుట్ర చేయడం సిగ్గుచేటైన విషయం అని నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. పెబ్బేరు ప్రజల,వ్యాపారస్తుల క్షేమం కోసం భూ యజమానులతో ప్రభుత్వపరంగా సంత కోసం 16 ఎకరాలు ఇస్తే ప్రత్యామ్నాయంగా వ్యవసాయ భూమి ఇప్పిస్తామని ఒప్పించి యజమానుల తో అంగీకార పత్రం(గిఫ్ట్ డీడ్) ఇప్పించేశామని ఇంతలో ఎన్నికలు రావడం పోటీలో ఉన్న మూర్ఖులు, వెధవలు రాజకీయంగా నన్ను ఎదుర్కొనలేక నేనేదో కబ్జా చేశానని దుష్ప్రచారం చేశానని ప్రచారం చేశారని అన్నారు. నేడు న్యాయస్థానం 30 ఎకరాల 19 గంటల భూమి యజమానులకు చెందుతుందని తీర్పు ఇవ్వడంతో – మిగతా4లో..

## జాతీయ స్థాయిలో రాణించాలి

- మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి
- రాష్ట్ర స్థాయిలో 13పతకాలు సాధించిన పోలీసులకు అభినందనలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి24,ప్రభాతవార్త:** క్రీడాస్ఫూర్తితో మెలగాలని, జాతీయ స్థాయిలో రాణించాలని ఎస్పీ డి.జానకి క్రీడాకారులకు సూచించారు. జిల్లా పోలీస్ సిబ్బంది క్రీడల్లో చురుకుగా పాల్గొని శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందించుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌లో జిల్లా పోలీసు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 13 పతకాలు (2 గోల్డ్, 3 రజతం, 8కాంస్యం) సాధించారని జిల్లా ఎస్పీ డి.జానకి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గెలుపోటములు సహజమని – మిగతా4లో..



## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

**హాజరుకానున్న 21,884 మంది విద్యార్థులు**



**మహబూబ్నగర్ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి తెలిపారు. నేటి నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు మార్చి 18న ముగియనున్నాయి. మహబూబ్నగర్ జిల్లాలో మొదటి సంవత్సరం 10859 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానుండగా ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులు 11025 మంది హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 35 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.



# డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

**రోడ్డు భద్రతలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకం : జిల్లా ఎస్పీ డా వినీత్**

**నారాయణపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** నారాయణ పేట రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా చేపట్టిన సురక్షితంగా అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ డా.వినీత్ ప్రారంభించారు. రోడ్డు భద్రతలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని ఆయన తెలిపారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ కంటి చూపు మందగించడం, కలర్ బ్లైండ్ వంటి సమస్యలు రావచ్చని పేర్కొన్నారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సులభంగా గుర్తించ గలరని చెప్పారు.జిల్లా వ్యాప్తంగా ఆటో, టాక్సీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు మరియు తగిన చికిత్స అందించనున్నట్లు తెలిపారు. డ్రైవర్లు వేగ పరిమితులు పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని హెచ్చరించారు. సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ ఉపయోగించరాదని, వాహన పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని పేర్కొన్నారు.ఈ శిబిరంలో మొత్తం 70 మంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

# న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలకు భారతీయ కిసాన్ సంఘ్ మద్దతు

**నారాయణపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కోర్టు ముందు న్యాయవాదులకు పరిరక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ దీక్షలు నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ సభ్యులు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ ఆధ్వర్యంలో నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించారు న్యాయవాదుల సంఘం నాయకులు పరిరక్షణ చట్టం అత్యవసరమని పేర్కొన్నారు. న్యాయవాదుల భద్రత కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అడ్వకేట్లు రఘువీర్ యాదవ్, మహమ్మద్ సలీం, సతీష్‌గౌడ్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు.భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు దీక్షలో ఉన్న న్యాయవాదులకు నిమ్మరసం ఇచ్చి ఆ రోజు దీక్షను విరమింపజేశారు. జిల్లా, పట్టణ స్థాయి నాయకులు కార్యక్రమంలో పాల్గొని మద్దతు ప్రకటించారు. రిలే నిరాహార దీక్షలు ఈ నెల 27వ తేదీ వరకుకొనసాగుతాయని న్యాయవాదుల సంఘంవెల్లడించింది.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శాసమూల బాలప్ప యాదవ్, పట్టణ అధ్యక్షులు ఆకుల వెంకటప్ప, జిల్లా సహకారదర్శి ప్రభు మిస్కిన్ పటేల్, నగర ఉపాధ్యక్షులు తంగు విశ్వనాథ్ రెడ్డి, సహ కార్యదర్శి బాపనపల్లి రాము, మండల అధ్యక్షులుగంప శ్రీనివాస, ఓబులాపురం మహిపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు.

# సమయస్ఫూర్తితో ఉపాధ్యాయుని ప్రాణాలు కాపాడిన విద్యార్థికి సన్మానం



ఉపాధ్యాయుని ప్రాణాలు కాపాడిన విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

**దామరగిద్ద, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** మద్దూరు మండలం నంది పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సుదర్శన్ వారం రోజుల క్రితం విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా దామరగిద్ద సబ్ స్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆ సమయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరగిద్దలో 10వ తరగతి చదువుతున్న బాపనపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి శివశంకర్ పరిస్థితిని గమనించి వెంటనే స్పందించాడు. గాయపడిన ఉపాధ్యాయుడికి తక్షణం ప్రథమ చికిత్స అందించి, సమీప ఆసుపత్రికి తరలించేందుకు సహకరించి సమయస్ఫూర్తి ప్రదర్శించాడు. విద్యార్థి చూపిన ధైర్యం, మానవత్వం అందరినీ ఆకట్టుకుంది.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన హిందీ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో సుదర్శన్ స్వయంగా శివశంకర్‌ను సన్మానించి అభినందించారు. సమయానికి సహాయం చేసి ప్రాణాపాయంనుంచి రక్షించినందుకు విద్యార్థికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షులు యశ్వంత్, హిందీ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. శివశంకర్ సేవాభావం ఇతరులకు ఆదర్శమని, ఇలాంటి విద్యార్థులు సమాజానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు.

# రబీ రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలి



రైతు భరోసా నిధులు జమ చేయాలని నిరసన తెలియజేస్తున్న రైతులు

**మద్దూరు,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** మద్దూరు మండల వ్యవసాయ అధికారి కార్యాలయం ముందు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులకు రబీ రైతు భరోసా నిధులు విడుదలలో జాప్యాన్ని నిరసిస్తు మంగళవారం ప్ల కార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రబి రైతు భరోసా పెట్టుబడి సాయం సాగుకాలం గడుస్తున్నా సాయం అందకపోతే రైతు ఎలా బతకాలి అన్నదాత ఆకలి కేకలు వినబడడం లేదా రాష్ట్ర ప్రభుత్వంరైతులకు ఇచ్చినటువంటి హామీలు అమలుచేయడంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తక్షణమే రబీ రైతు భరోసానిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో భరత్,హన్మంతు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ఉప్పునుంతల ఫిబ్రవరి 24ప్రభాతవార్త :** 1974,76 సంవత్సరంలో ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం పోలిశెట్టి పల్లి స్టేజి సమీపంలో ఉన్నపలకపల్లి గ్రామంలో గుడిబండ ఆలయ ప్రాంగణంలో 40 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, ఒకరినొకరు ఆలింగనం చేసుకొని సమ్మేళన కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. విద్యాభ్యాసంలో కలుసుకున్న పూర్వవిద్యార్థులు వారు ప్రస్తుతం ఉన్న పరిస్థితులను, వారి స్థితిగతులను ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ కుటుంబ సమస్యలు, తదితరఅంశాలపై చర్చించుకున్నారు. విద్యాభ్యాసంలో బాల్యమిత్రులు కొన్నిఏళ్ల తర్వాత కలుసుకోవడంతమ శుభ పరిణామం అని, వారు అభివృద్ధి చెందుతున్న అంశాల పట్ల చర్చించుకున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీఉమామహేశ్వర దేవస్థాన కమిటీ మాజీ డైరెక్టర్కందూరు సుధాకర్,చంద్రకుమార్, విశ్రాంతఉపాధ్యాయులు విద్యాసాగర్, వెంకట రమణ, రవి,శ్యామల, భారతి, రమాదేవి తో పాటు 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



1974,76 వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు

# మామిడి రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమం

**వీపనగండ్ల ఫిబ్రవరి24, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామంలో మంగళవారం నాడు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో, సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ కింద హ్యూమన్ రిసోర్స్ డెవలపమెంట్ కార్యక్రమంలో భాగంగా మామిడి రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జిల్లా ఉద్యానవన అధికారి విజయ భాస్కర్ రెడ్డి శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి ఉద్యానవన శాఖ వీపనగండ్ల మండల అధికారి కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడిలో యాజమాన్య పద్ధతులు మరియు సస్యరక్షణ చర్యలపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించడం జరిగిందని వారు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యాన శాఖ అమలు చేస్తున్నరాయితీ పథకాలైన ఆయిల్ పామ్, పండ్ల తోటల పెంపకం, కూరగాయల పందిర్లు, మల్చింగ్, డ్రిప్ సదుపాయం మరియు కూరగాయల నారుపైరైతులకు వివరించారు. మాధనపురం శాస్త్రవేత్త డా. రాజేంద్ర రెడ్డి మాట్లాడుతూ సింథటిక్ పీరిత్రోయిడ్స్ మామిడి తోటలో పిచికారి వాడకాన్ని తగ్గించాలని, ముఖ్యంగా మామిడి పూత దశలో కీటకనాశిని మందులు వాడరాదని సూచించారు. నల్ల తామర పురుగు నివారణకు నీలిరంగు అట్టలు తోటలో ఏర్పాటు చేయాలని, వేపనూనె పిచికారీచేయాలని సూచించారు. నల్ల తామర అధికంగా ఉన్నప్పుడు టోల్ఫెన్ పైరైడ్ మందు పిచికారీ చేయాలని సూచించారు. పిందె పసుపు రంగులోకి మారి రాలిపోతే ప్లానోఫిక్స్ పిచికారీచేయాలని, పిందె దశలో పొటాషియం మరియు యూరియా ఎరువులు వేయాలని సూచించారు. రైతులు జీవ శిలీంద్ర నాశినులు వినియోగించడం అలవాటు చేసుకోవాలని మరియు సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని వివరించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి శ్రీకృష్ణయ్య, ఉద్యాన విస్తరణ అధికారులు శ్రీబాలప్రకాశ్, శ్రీమతి శిరీష, డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ శ్రీ రవి కుమార్ మరియు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న కెవికె శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి

# నేడు అయ్యవారిపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో నేడు బుధవారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం వారి ఆధ్వర్యంలో 18 వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్ రెడ్డి యాదిరెడ్డి, గ్రామ సర్పంచు జిల్లెల్ల జగత్ రెడ్డిలు తెలిపారు. నేడు 25 న బుధవారం ఉదయం 6.03 నిమిషాలకు శ్రీ ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, అర్చనలు, ధూప దీప నైవేద్యం, ఉదయం 8.01 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, నవగ్రహ పూజ, స్వామి వారికి అభిషేకం, అర్చనలు, ధూప దీప నైవేద్యం,ఉదయం 10.08 గంటలకు శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం, ఉదయం 11.53నిమిషాలకు కళ్యాణ లక్ష్మి నరసింహ స్వామి హోమం, సాయంత్రం 6.45 నిమిషాలకు స్వామివారి పల్లకి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కైంకర్య వివరములు కళ్యాణ మహోత్సవంలో పాల్గొనేవారు కళ్యాణ మహోత్సవం రూ.1116లు, పుష్పాలంకరణ సేవ రూ.516 లు,శ్రీవారి అభిషేకం రూ.116లు హోమం రూ. 516 లు ఉంటుందని వారు వివరించారు. మండలంలోఅధికసంఖ్యలో పాల్గొని శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికళ్యాణోత్సవం తిలకించాలని ఆలయకమిటీ చైర్మన్ చెన్‌రెడ్డియాదిరెడ్డి, గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డిలు కోరారు.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

# రోడ్డు విస్తరణలో ఇండ్లు పోగొట్టుకున్నాం..

**ఇళ్ల స్థలాలు కేటాయించండి అని తహసీల్దార్‌కు వినతి**

**నవాబుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** నాలుగు సంవత్సరాల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా ఇల్లు కోల్పోయామని ఇప్పటివరకు ఇల్లులేక ఇబ్బందుల్లో ఉన్నాము ఆదుకోవాలని మంగళవారం మండల తహసిల్దార్‌కు ఇండ్లు కోల్పోయిన బాధితులు వినతి పత్రం అందజేశారు. నవాబుపేట మండల కేంద్రంలో ఎర్ర సత్యం చౌరస్తా నుండి లోకిరేవు రోడ్డులో గొల్ల బాలయ్య ఇంటి వరకు రోడ్డు విస్తరణలో 4 సంవత్సరాల క్రితం ఇండ్లను కోల్పోవడం జరిగింది. వారందరికీ ఇండ్ల స్థలాలను చూపిస్తామని అప్పటి సర్పంచ్, అధికారులు చెప్పడం జరిగింది. అందుకు అనుగుణంగా సర్వేనెంబర్ 105/772 ను గుర్తించడం జరిగింది. బాధితులందరికీ జిల్లా కలెక్టర్ ద్వారా అప్రూవల్ ఫైలుసిద్ధంగా ఉంది.అయినప్పటికీ నాలుగు సంవత్సరాలుగా ఇప్పుడు అప్పుడు అంటూ కాలయాపన చేస్తూ వస్తున్నారని ఉన్న కొద్ది స్థలంలో ఇండ్లు కట్టుకోలేక బాత్రూం లేక ఇండ్ల ముందు మురుగు కాలువలతో ఇబ్బంది పడుతూ వస్తున్నారని బాధితులు కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. బాధితులకు విచారణ చేసి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది. సీసీ రోడ్డు కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా రోడ్డు వేయుటకు సిద్ధంగా ఉన్నానని చెప్పడంజరిగింది. కానీ బాధితులు తమకు ఇండ్ల స్థలాలు కేటాయించే వరకు పనులు చేపట్టవద్దని కోరుతు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు సమస్య పరిష్కరించిన వెంబడే పనులు ప్రారంభిస్తామని చెప్పారన్నారు.కార్యక్రమంలో ఇళ్ల స్థలాల బాధితులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

# పసిపాప మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి



దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్న సిపిఎం నాయకులు

**దామరగిద్ద, ఫిబ్రవరి24 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరుగుతున్న జాతరలో దేవాలయం లోకి దర్శనానికి వెళ్లిన ఒక రజక, దళిత కుటుంబం మీద దాడిలో మరణించిన రెండు నెలల పసిపాప మరణానికి కారణం అయినా నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపుమేరకు మంగళవాకం దామరద్ద మండల కేంద్రంలో సిపిఎం శ్రేణులు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ నేటి ఇంటర్నెట్ ప్రపంచంలో కూడా కులన్మాదంతో సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించి అగ్రకుల దూరహంకారంతో ఒక రజక దళిత కుటుంబం మీద దాడి చేస్తే రెండు నెలల పసిపాప ప్రాణాలు విడిచిందని అన్నారు.పసిపాప మరణానికి కారకులైనటువంటి ఆ గ్రామ సర్పంచ్ తో పాటు మరో ఎనిమిది మంది మీద కేసు అయినప్పటికీ అక్కడ ఉన్నటువంటి పోలీస్ యంత్రాంగం అధికార పార్టీకి పెత్తందారులకు తలోగ్గి అరెస్టు చేయడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో కూడా ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని అన్నారు. ముఖ్యమంత్రి కలగజేసుకొని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించి ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడికి గురైన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని ఆ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, సిపిఎం మండల కార్యదర్శి అంజిలయ్య గౌడ్, నాయకులు జోషిశివకుమార్, శీను,మోహన్, మహేష్ పాల్గొన్నారు.

**మద్దూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెరలో రజక కుటుంబం మీద దాడి చేసి పసిపాప మరణానికి కారకులైన కుల దురహంకారులను కఠినంగా శిక్షించాలని మద్దూరు మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా కులోన్మాదంతో రెచ్చిపోయి తక్కువ జాతి వాళ్ళు గుళ్ళోకి రావద్దంటు రజక దళిత కుటుంబం మీద దాడి చేసి పసిపాప మరణానికి కారకులైన అగ్రకుల రెడ్డి వర్గానికి చెందిన ఆ గ్రామ సర్పంచ్‌తో పాటు మరో ఎనిమిది మందిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షి ంచాలని డిమాండ్ చేశారు.ప్రపంచమంతా ఇంటర్నెట్ యుగం అంటూనే మరోవైపు మనిషిని మనిషిగా చూసే అటువంటి సమాజం కరువైందని అన్నారు. కార్యక్రమంలో భరత్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



పసిపాప మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

# విజయవంతమైన పశు వైద్య శిబిరం

**కోయిల్‌కొండ ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** కోయిల్ కొండ మండలం తిరుమలంపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరం విజయవంతం అయిందని మండల పశు వైద్యాధికారి డాక్టర్ నరేష్ తెలిపారు. ఈ శిబిరాన్ని గ్రామ ఉపసర్పంచ్ సాయిలు, మండల పశువైద్యాధికారి డాక్టర్ నరేష్‌లు ప్రారంభించారు. కృత్రిమ గర్భధారణ చేసిన పశువులకు చూడి పరీక్షలు నిర్వ హించారు. ఆవులకు, గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దూడ లకు నటల నివారణ మందులను తాపడం జరిగింది అని వైద్యులు తెలిపారు.అనంతరం మండల పశు వైద్యాధికారి డాక్టర్ నరేష్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో పశువులకు ప్రబలే వ్యాధుల గురించి రైతులకు వివరించారు. రైతులు తమ పశువుల పట్ల జాగ్రత్తలు తీసుకొని పోషించాలని అన్నారు. ఎదకు వచ్చిన ఆవులకు, గేదెలకు సకాలంలోఎదసూదులు వేసుకోవాలని సూచించారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అభంగం పట్టణం పశు వైద్య శాఖ లైవ్ స్టాక్ అధికారి జయప్రద, కొత్లాబాద్ పశువైద్యాధికారి హర్షవర్ధన్, గోపాలమిత్ర సూపర్వైజర్ విజయ్‌కుమార్, గోపాల మిత్రులు అశోక్‌గౌడ్, బివెంకట్ నారాయణ,రామకృష్ణ,వెంకోజీ,రామకృష్ణ,రాములు,రైతులు పాల్గొన్నారు.



వైద్య చికిత్సలు నిర్వహిస్తున్న దృశ్యం

# కబ్జా చేసిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వ భూమి నుండి తొలగించాలి

**వీపనగండ్ల ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** వీపనగండ్ల. మండల కేంద్రంలో ఉన్న 721 సర్వే నెంబర్లు 16 ఎకరాల 20 గుంటల భూమిని అన్యాక్రాంతమైనటువంటి విషయం తెలిసింది అయితే సోమవారం నాడు అట్టి భూమిలో కబ్జా చేశారని సగనమోని రామకృష్ణ సగనమోని వెంకటేష్ భూమి కబ్జా చేశారని వీపనగండ్ల తహసిల్దార్ వరలక్ష్మి ఖాళీ చేయించడం జరిగింది అయితే అట్టి భూమిలో మా ఒక్కరినే ఖాళీ చేయించడం కాకుండా 721 సర్వే నెంబర్లు ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న ప్రతి ఒక్కరిని తొలగించాలని వారు మంగళవారం నాడు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. అక్రమంగా గురైనటువంటి భూమిని అందర్నీ తొలగించేటటువంటి బదులు మా మీదనే కక్ష సాధింపుగా చేయడం సరైంది కాదని ప్రభుత్వ భూమిలో ఆత్మీయ చేసుకున్న మాకు ఏడు రోజుల వరకు ఖాళీ చేయాలని నోటీస్ ఇచ్చారు మేము సామాను సర్దుకొకం మునిపే ఆ భూమి ఖాళీ చేయించారు. కాబట్టి కబ్జాలా ఉన్న ప్రతి ఒక్కరిని కూడా ఖాళీ చేయించాలని వారు ఎమ్మార్వోను డిమాండ్ చేశారు.



ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసిన సిఎస్ నరసింహులు

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**మల్దకల్. ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్దకల్ లో రేపటినుండి జరిగే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఎస్ నర్సింహులు,డిపార్ట్మెంటల్ అధికారి శేఖర్ తెలిపారు.రేపటి నుండి ఫస్ట్ ఇయర్ 159 విద్యార్థులు,ఎల్లుండి నుండి సెకండ్ ఇయర్ 65 విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉదయం 8:30 గంటలకు పరీక్ష కేంద్రనికి చేరుకుని ప్రశాంతంగా రాయాలన్నారు. ఎలాంటి అవంచినీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రం ఏరియాలో 144 సెక్షన్ ఉన్నట్లు తెలిపారు.విద్యార్థులు సెల్ ఫోన్ లు, ఇతర ఎలక్ట్రానిక్‌పరికరాలకు అనుమతి లేదు అన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా ఉండడానికి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే విద్యార్థులు అందరూ హాల్ టికెట్స్ తీసుకున్నందున సకాలానికి చేరుకోవాలన్నారు.

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ లకు చెందిన ఇంటర్ విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంలో 55 మంది విద్యార్థులు,ద్వితీయ సంవత్సరంలో 40మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంచార్జ్ రాకేష్ తెలిపారు. కస్తూర్బా పాఠశాలలో ఈసారి జూనియర్ కళాశాలను ప్రారంభించారు.ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి42 మంది విద్యార్థినిలు పరీక్షలు వ్రాయనున్నారని కేజీబీవీ స్పెషల్ అధికారి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల ఇంఛార్జి తెలిపారు.విద్యార్థులు ఎలాంటిఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన కోరారు. ఈ ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 13 వరకు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

# ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఊర్మిళాదేవి**



**దేవరకద్ర,ఫిబ్రవరి 24 ప్రభాత వార్త:** నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష నిర్వ హణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని దేవర కద్ర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఊర్మిళాదేవి తెలి పారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల భద్రతా పర్యవేక్షణ చర్యలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని ప్రిన్సిపాల్ ఊర్మిళాదేవి వెల్లడించారు.మొత్తం ఫస్ట్ ఇయర్‌కి గాను 483 మంది విద్యార్థులు, సెకండ్ ఇయర్‌కి 444 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని అన్నారు. ఈ సంవత్సరం కూడా 9గంటలకు ఒక్క రెండునిమిషాలు మాత్రమే ఎవరైనా ఆలస్యమైతే పర్మిషన్‌కు వెసులుబాటు ఉంటుంది. కాబట్టి విద్యార్థులు వెసులుబాటు దృష్టిలో పెట్టుకొని అందరూ 8:30 కి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ ఊర్మిళాదేవి తెలిపారు.

# చీరకు నిప్పు అంటుకుని వృద్ధురాలు మృతి

**నవాబ్‌పేట,ఫిబ్రవరి24 ప్రభాతవార్త :** వంట చేస్తున్న మహిళకు ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని మహిళ మరణించిన ఘటనమండల పరిధిలోని కాకరజాల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కాకరజాలకు చెందిన గోపు పద్మమ్మ (70) అనే వృద్ధురాలు పద్మమ్మ ఈ నెల 23వ తేదీ దాదాపుగా మధ్యాహ్నం 12:30గంటల సమయంలో ఇంట్లో వంట చేసేందుకు పొయ్యి దగ్గరకు వెళ్లగా ప్రమాదవశాత్తూ ఆమె చీరకు నిప్పు అంటుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంటలను ఆర్పే ప్రయత్నం చేసి, తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం ఆమె తుదిశ్వాస విడిచారు. మృతురాలి కుమారుడు గోపు జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవాబ్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# నేషనల్ చెస్ పోటీలకు ఎంపిక



జాతీయ చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు నవీన్

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి24 ప్రభాతవార్త:** జాతీయ చెస్ పోటీలకు మండలంలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన క్రీడాకారుడు నవీన్ ఎంపికయ్యారు.ఈ నెల ఫిబ్రవరి 23వ తేదిన జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ పోటీలను నిర్వహించిన సందర్భంగా చిన్నచింతకుంట మండలం అల్లీపురం గ్రామానికి చెందిన డి. నవీన్ విద్యార్థి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని హసిని బిపి ఈడి కాలేజ్ లో ఫస్ట్ ఇయర్ చదువుతూ చెస్ పోటీలలో పాల్గొని వరుసగా (5/4 ) రౌండ్స్ గెలుపొంది, మార్చి 02 నుండి 06 వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని, తిరుచిరప్పల్లి, భారతీ దాసన్ యూనివర్సిటీ లో జరగబోయే సౌత్ జోన్ అల్ ఇండియాఇంటర్ యూనివర్సిటీ నేషనల్ పోటీలకు పాలమూరు విశ్వ విద్యాలయం తరుపున పాల్గొన్నారని పాలమూరు యూని వర్సిటీ పి.డి. శ్రీనివాసులు తెలిపారు.జాతీయ చెస్ పోటీలకు నవీన్ ఎంపికవ్వడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# తమకు రక్షణ చట్టం తేవాలని న్యాయవాదుల పాదయాత్ర



**రాజాపూర్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** రాజాపూర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినాక న్యాయవాదుల పై దాడులు, హత్యలు పెరిగి పోయాయని న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేస్తూ అలంపూర్ నుండి తెలంగాణ సెక్రటరీయేట్ వరకు న్యాయ వాదులు చేస్తున్న పాదయాత్ర మంగళవారం రాజాపూర్ మండల కేంద్రానికి చేరుకోగా గ్రామ సర్పంచ్ కావలి రామకృష్ణ తదితరులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడేందుకు న్యాయవాదులే కారణమని, రాష్ట్ర ఏర్పాటులో న్యాయవాదుల పాత్ర కీలకమని, తీరా రాష్ట్రం సిద్ధించాక తమకే రక్షణ లేకుండా పోయిందని వారు వాపోయారు. తమ పై నిత్యం దాడులు, దమనకాండ, హత్యలు జరుగుతూనే ఉన్నాయని తమకు రక్షణ కావాలని 12 ఏళ్లుగా మొరపెట్టుకున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



జీనుగురాల పల్లె ప్రకృతి వనంలో తొలగించిన చెట్లు

# చెట్ల లెక్క తేలలె..

- తొలగించినవి ఎన్ని.. చర్యలు ఏవి..
- మూడు రోజులైనా వివరాలు తెలుపని అధికారులు

**దేవరకద్ర, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త):** జీనుగురాల పల్లె ప్రకృతి వనంలో ఎన్ని మొక్కలు తొలగించారు..? అనే విషయం నేటికీ తెలలేదు. వివరాల్లోకి వెళ్తే దేవరకద్ర నియోజకవర్గంలోని జీనుగురాల పల్లె ప్రకృతి వనంలో మూడు రోజుల కిందట సుమారు 200 మొక్కల వరకు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు జెసిబి సాయంతో తొలగించారు. ఇదే విషయం సోషల్ మీడియా ద్వారా పలు పత్రికల ద్వారా ఇటు ఫారెస్ట్ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులకు కూడా సమాచారం చేరింది. ఫారెస్ట్ రేంజర్ రాజేందర్ ఆధ్వర్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామానికి వెళ్లి పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి ఎన్ని మొక్కలు తొలగించారు అని పంచనామా నిర్వహించారు. ఇదే విషయాన్ని దేవరకద్ర ఎంపీడీవో కు రిపోర్ట్ చేసినట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామపంచాయతీలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి ఒక ఆహ్లాదకర వాతావరణాన్ని తీసుకొచ్చింది. అయితే జీనుగురాల గ్రామంలో చాలా చోట్ల ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ ఫారెస్ట్ అధికారుల అనుమతి లేకుండా పల్లె ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన వృక్షాలను తొలగించాల్సిన అవసరం ఎందుకు ఏర్పడింది. ఫారెస్ట్ అధికారులు ఇటు రెవెన్యూ అధికారులు కలిసి పంచనామా చేసినప్పటికీ ఎన్ని మొక్కలు తొలగించారనే విషయాన్ని నేటికీ అధికారికంగా తెలుపకపోవడం గమనార్హం.

## నేడు నాగర్‌కర్నూల్‌కు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాక



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త):** కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దాడిలో మృతి చెందిన 2 నెలల పసిపాప కుటుంబాన్ని పరామర్శించేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కేటీఆర్ నాగర్‌కర్నూల్‌కు రానున్నారని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకుంటారని తెలిపారు. 11:30 వరకు కేటీఆర్ నాగర్‌కర్నూల్‌కు చేరుకుంటారని, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు, నాయకులు అధికసంఖ్యలో తరలివచ్చి బాధిత కుటుంబానికి అండగా ఉండాలని, న్యాయం జరిగే వరకు పోరాటం చేద్దామని మాజీ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

## పసిపాప మరణానికి కారకులైన నిందితులకు కఠిన శిక్ష విధించాలి : సిపిఎం



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

**నారాయణపేట, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త):** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెరలో జరిగిన పసికందు మృతి ఘటనపై సిపిఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కుల వివక్షతో దాడి చేసి పాప మృతికి కారణమైన నిందితులపై హత్య కేసు నమోదు చేయాలని జిల్లా కార్యదర్శి జి. వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గుడిలోకి వెళ్లేందుకు టికెట్ తీసుకోలేదనే నెపంతో చంద్రకళ, ఆమె భర్తపై దాడి చేసి పసికందును తన్నడంతో మృతి చెందినట్లు ఆరోపించారు. ఈ ఘటన అమానుషమని సిపిఎం నాయకులు ఖండించారు. పోలీసులు బాధితుల పక్షాన నిలవకుండా నిందితుల తరపున వ్యవహరించడందారుణమని విమర్శించారు.దేశానికి స్వాతంత్రం వచ్చిన దశాబ్దాలు గడిచినా అణగారిన వర్గాలకు న్యాయం జరగకపోవడం బాధాకరమన్నారు. నిందితులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంబంధిత సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలని కోరారు. నిరసనలో సిపిఎం (ఎస్ఎఫ్ఐ) నాయకులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ ఎస్సైలుగా ఉద్యోగం పొందిన ట్రైనీ ఎస్సైలకు కృష్ణ చెక్‌పోస్టులో శిక్షణ



**కృష్ణ, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త) :** గతేడాది గ్రూప్ 2 ద్వారా ఎక్సైజ్ ఎస్సైలు గా ఉద్యోగం పొందిన అభ్యర్థులకు కృష్ణ చెక్పోస్ట్ లో సీఐ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ ప్రారంభించారు. ట్రైనీ ఎక్సైజ్ ఎస్సైలు శ్యాంసుందర్ రెడ్డి, కేతేశ్వర్ రెడ్డి, జి.రాజేశ్వర్ రెడ్డి, బి.సతీష్, ఎస్. శ్రీనివాస్, స్నేహలకు వారం రోజులుగా శిక్షణ ఇవ్వబడుతుందని ఎస్ఐ శ్రవణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మంగళూరు యూనివర్సిటీకి పియు జట్టు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త):** అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో భాగంగా పాలమూరు యూనివర్సిటీ క్రాస్ కంట్రీ విమెన్ జట్టు మంగళూరు యూనివర్సిటీ, మంగళూరు కర్ణాటక రాష్ట్రంలో రేపటి నుంచి ఈనెల 28 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ టీం బయలుదేరింది. ఈ సందర్భంగా పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొ॥ జిఎన్ శ్రీనివాస్ క్రీడాకారులకు ట్రాక్ షూట్, టీం యూనిఫామ్‌లను అందించారు. క్రీడల్లో నైపుణ్యతను ప్రదర్శించి, విజయాలను అందుకోవాలని అలాగే యూనివర్సిటీలో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని యూనివర్సిటీకి మంచి గుర్తింపు తీసుకురావాలని పేర్కొన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ॥ పూస రమేష్ బాబు, యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. వై. శ్రీనివాసులు, ప్రొ॥ సత్య భాస్కర్ రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ జి. మహేశ్వరి, ఎంపికైన క్రీడాకారులు, వి.సింధు, కే.మౌనిక, ఎం.సువర్ణ, కె. శివలీల, కె.సుశ్రుత పాల్గొన్నారు.



మంగుళూరుకు వెళ్లిన పియు జట్టు

# మైనర్ మానసిక వికలాంగురాలిపై అత్యాచారం

- నిందితునికి 20 ఏళ్లు కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధింపు
- న్యాయస్థానం కఠిన తీర్పు
- నేరస్తుల్లో భయం నింపుతున్న కఠిన తీర్పులు
- జిల్లాలో నేరాలకు పాల్పడితే శిక్షలు తప్పవు
- వనపర్తి జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డి

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి24 (ప్రభాతవార్త):** మైనర్ మానసిక వికలాంగురాలిపై జరిగిన అత్యాచార కేసులో నేరం రుజువవ్వ దంతో నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధిస్తూ వనపర్తి జిల్లా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్.సునీత మంగళవారం నాడు కఠిన తీర్పునిచ్చినట్లు జిల్లా ఎస్పీ సునితరెడ్డి, తెలిపారు.కేసు వివ రాలు...వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కీర్యాతాండ, అప్పాయిపల్లి గ్రామానికిచెందిన మైనర్ మానసిక వికలాంగు రాలిపై అదే ప్రాంతానికి చెందిన లావుడ్య అక్షయ్ అనే వ్యక్తి తేది 24.10.2024న మధ్యాహ్న సమయంలో అత్యాచారానికి పాల్ప డ్డాడు.బాలిక ఇంటి దగ్గర ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా తీసుకుని, ఫోన్‌లో బొమ్మలు చూపిస్తానని నమ్మించి ఇంటి సమీపానికి పిలిపించి, బలవంతంగా అత్యాచారం చేసినట్లు బాలిక అమ్మమ్మ ఈ ఘటనను గమనించి బొంబాయిలో ఉంటున్న కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, బాలిక తల్లి వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే అప్పటి వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ కృష్ణయ్య,దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాలు సేకరణ బాధితురాలి వాంగ్మూలం నమోదు అవసరమైన చట్టపరమైన చర్యలు పూర్తి చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు ప్రస్తుత సీఐ రత్నం ఎస్సై హృషికేష్‌కోర్టు లైజనింగ్ అధికారి హెడ్ కానిస్టేబుల్ సత్యం,కోర్టు కానిస్టేబుల్ ఖాదర్, సాక్షులను కోర్టులో



జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డి

ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసచారి సమర్థవంతంగా వాదనలు వినిపించారు. కేసు పూర్వా పరాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్. సునీత నిందితుడిపై నేరంనిరూపితమైందని నిర్ధారించి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధించారని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, తెలిపారు.ఈ కేసులో నిందితునికి శిక్షపడటంలో కృషి చేసిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ సమాజాన్ని కుదిపేసే నేరాలకు పాల్పడిన వారిపై న్యాయ స్థానం కఠినశిక్షలు విధించడం ద్వారా నేరస్తుల్లో భయం నెలకొ ల్పుతున్నట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఇలాంటి కఠిన తీర్పులు సమాజానికి రక్షణ కవచం లాంటివి. నేరం చేయాలనే ఆలోచనకే నేరస్తుల్లో భయంకలిగించేలా న్యాయస్థానం వ్యవహరిస్తోందని ఇలాంటి తీర్పులుఇవ్వడం ద్వారా భవిష్యత్తులో నేరాలు చేయాలనే ఆలోచన భయం పుట్టిస్తుందని జిల్లాలో నేరాలకు పాల్పడిన వారినిచట్టంకఠినంగా శిక్షిస్తుంది. బాధితులకు న్యాయం అందించడంలో పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దు. ఏ అన్యాయం జరిగినా వెంటనే పోలీసులను సంప్రదించాలని ఎస్పీ అన్నారు.

# నేడు పియూలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్

### పియూ పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 24, (ప్రభాతవార్త):** పాలమూరు విశ్వవిద్యాలయం యూనివర్సిటీ పీజీ కాలేజ్ లో బుధవారం ఉదయం 10:30 గంటలకు వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ డా. డి మధుసూదన్ రెడ్డి తెలిపారు. యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం బుధవారం యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించడం జరుగు తుందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥ జిఎన్ శ్రీనివాస్, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొ॥ పి.రమేష్ బాబు హాజరవుతారని చెప్పారు. పాలమూరు విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని డిగ్రీ, ఇంటర్మీడియట్ కాలేజీలలో చదువుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ఎవరైతే యూత్ పార్లమెంట్లో వారి యొక్క లోకల్ లాంగ్వేజ్ ఇంగ్లీష్,హిందీ ఇతర భాషలలో ప్రావీణ్యం ఉన్నవారు బాగా



మీడియాతో మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

పెర్ఫార్మ్ చేస్తే రాష్ట్ర స్థాయికి సెలెక్ట్ అవుతారని తెలిపారు. రాష్ట్ర రాష్ట్రస్థాయిలో అద్భుత ప్రదర్శన కనబరిచిన వారు జాతీయ స్థాయికిఎంపిక అవుతారని మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లోపాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కే.ప్రవీణ, ప్రోగ్రాం ఆఫీసర్స్ డా.రాఘవేందర్,డా. గాలేన్న, డా.శివకుమార్ సింగ్, డా.జ్ఞానేశ్వర్, డా. చిన్న దేవి పాల్గొన్నారు.

# దేశ రక్షణకు వ్యక్తి నిర్మాణం కీలకం

### రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ జిల్లా సంఘచాలక్ ఉప్పలంచ మల్లికార్జున్

**నారాయణపేట, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త) :** మంచి సేవాభావం, క్రమశిక్షణ, దేశభక్తి వంటి గుణాలను పెంపొందించడం ద్వారానే సమాజం బలపడుతుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ జిల్లా సంఘచాలక్ ఉప్పలంచ మల్లికార్జున్ అన్నారు. దేశ రక్షణ, సమాజ శ్రేయస్సు ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని శీలా గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ప్రతిష్టిత వ్యక్తుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యవక్త వసంతం వెంకటేష్‌తో కలిసి హాజరైన మల్లికార్జున్, ఆర్ఎస్ఎస్ లక్ష్యం వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమని వివరించారు. సంస్థకు కులమత, ప్రాంతాల భేదాభిప్రాయాలు లేవని స్పష్టం చేశారు.ఏ వర్గానికి చెందిన వారైనా స్వచ్ఛందంగా





మాట్లాడుతున్న ఉప్పలంచ మల్లికార్జున్

చేరి దేశసేవ చేయవచ్చన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో ప్రధానమైన విలువ అని చెప్పారు. ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యాపార నిమిత్తం వచ్చి భారతదేశంలో విభజన విధానాలు అమలు చేసిందని విమర్శించారు. విదేశీయుల కుట్రలవల్ల దేశ ఐక్యత దెబ్బతిందన్నారు. హిందువులు ఐక్యంగా ఉంటే ప్రపంచంలో భారతదేశం శక్తివంతమైన స్థానం సంపాదిస్తుందని అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో డా.మదన్ మోహన్ రెడ్డి, మ్యాడమ్ ప్రభాకర్, కన్నా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ప్రముఖులు

### పర్యావరణ పరిరక్షణ కోసం

# చెట్ల సాగు విధానాన్ని రైతులు అవలంబించాలి

- జోమాటో ఆలిండియా మేనేజర్ వత్సల్

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త):** దేశంలో పర్యావరణ పరిరక్షణకు పంటలతో చెట్లను సాగు చేసే కార్యక్రమాన్ని రైతుల కోసం రూపొందించినట్లు జోమాటో ఆలిండియా మేనేజర్ వత్సల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బొమ్మనపల్లి రైతు వేదికలో రైతులకు ఆగ్రో ఫారెస్ట్రీ పథకంపై అవగాహన కార్యక్రమానికి ఆయన కోనేరు స్వచ్ఛంధ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ సలీం తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఢిల్లీ కేంద్రంగా తమ సంస్థ రైతులు సాగు చేసే పండ్లతోటలు , కలప మొక్కల కోసం నలభై ఏళ్ళుగా పనిచేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేయడంజరిగిందన్నారు.ప్రధానంగా కాలుష్య నివారణకు పంజాబ్, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర లలో రాష్ట్రానికి 10లక్షల మొక్కలు 5వేల మంది రైతులకు అందించామని ప్రస్తుతం తెలంగాణలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.నాగర్‌కర్నూల్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా నాగర్ కర్నూల్, తెల్కపల్లి, లింగాల, బల్మూర్,ఉప్పునూంతల, అచ్చంపేట మండలాల్లో గ్రామాలను ఎంపిక చేసి సంప్రదాయ పంటలకు భిన్నంగా పండ్ల తోటలు మామిడి, జామ, నిమ్మ,కొబ్బరి, కలప మహాగని, ఎర్రచందనం టేకులను రైతుకు కేవలం రూ.5.10



చెట్ల సాగు పై అవగాహన కల్పిస్తున్న జొమాటో ఆల్ ఇండియా మేనేజర్ వత్సల్

వ్యయంతో అందించుటకు సర్వే పనులను ప్రారంభించామన్నారు. తెలంగాణలో జోమాటో సంస్థ కోనేరు స్వచ్ఛంద సంస్థ వారు సంయుక్తంగా ప్రాజెక్టును చేపట్టనున్నాయన్నారు. కోనేరు సంస్థ ఎండి మహమ్మద్ సలీం మాట్లాడుతూ వ్యవసాయభూముల్లో అటవీ మొక్కలను నాటి వాణిజ్యపంటగా రైతు ఆదాయాన్ని పెంపుకు తోడ్పాటును అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జోమాటో సినియర్ మేనేజర్ గంగధార్. నాగర్ కర్నూల్ జిల్లా ప్రోగామ్ కోఆర్డినేటర్ ఆవుల మొగులాల్, సర్పంచ్ లక్ష్మీధర్మా నాయక్, ఏఈవో ప్రియా, బొమ్మనపల్లి, సింగారం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా ఈదమ్మ జాతర ఉత్సవాలు

**వీపనగండ్ల ఫిబ్రవరి24, (ప్రభాతవార్త):** మండలంలోని తూముకుంట గ్రామంలో ఘనంగా ఈదమ్మ జాతర ఉత్సవాలు ప్రజలు జరుపుకున్నారు. మంగళవారం నాడు జరిగిన ఈ ఉత్సవాలలో గ్రామస్తులు మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు బోనాలు సిద్ధం చేసుకుని దేవత ఉత్సవాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఈదమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు రాజు ఆ గ్రామ సర్పంచ్ పల్స రామన్ గౌడు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి సంవత్సరము బోనాల పండుగ శిడే ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఈదమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామంలోని పాడిపంటలు మరియు గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండే విధంగా ఆమెను కోరుకోవడం జరుగుతుందని ప్రతి ఇంటికి ఒక బోనం చొప్పున వెళ్లి ఈదమ్మ దేవతకు మొక్కుబడులను తీర్చుకోవడం జరుగుతుందని వారుతెలిపారు.ఈ ఉత్సవాలు గ్రామంలోని ప్రతి ఒక్కరూ నిర్వహించుకోవడంతో పాటు ముందుగా ఆలయం చుట్టూ సిడేను ఏర్పాటు చేసి భక్తులు పెద్ద ఎత్తున దేవతను కొలుచుకుంటూనినాదాలు చేస్తూ నిర్వహించుకోవడం జరుగుతుంది అని వారు తెలిపారు.



దేవతకు సిడే ద్వారా మొక్కుబడులు తీర్చుకుంటున్న భక్తులు

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

**వీపనగండ్ల జనవరి24, (ప్రభాతవార్త) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం నిర్వహించనున్న వార్షిక పరీక్షలు ఈనెల 25వ తేదీ నుండి మార్చి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శివ గౌడ్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026 సంవత్సరం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివ గౌడ్ తెలిపారు.ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 69 మంది,ప్రథమ సంవత్సరంవిద్యార్థులు108 మంది,ప్రైవేట్ అభ్యర్థి ఒకరు,మొత్తం178 మంది విద్యార్థులు పరీక్ష రాయను న్నట్లు తెలిపారు. వార్షిక పరీక్షలు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 8:30 నుండి 9:05 నిమిషాల వరకు అనుమతిస్తామని అన్నారు. ఎలక్ట్రానిక్స్ లాంటి వస్తువులకు అనుమతి లేదని విద్యార్థులు హాల్ టికెట్ తప్పకుండా చూపించాలని అన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ : దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర,ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త):** ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలను ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో రాయాలని సూచించారు.కష్టపడి చదివిన ప్రతి విద్యార్థి తప్పకుండా మంచి ఫలితాలు సాధిస్తారని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్రానికి బలం అని పేర్కొన్నారు.

## సైన్స్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి ప్రశాంత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త):** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్‌పిఎస్‌టి) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ పరీక్షలో చిన్నచింతకుంట జడ్పి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి (ఇంగ్లీష్ మీడియం) విద్యార్థి ప్రశాంత్‌కుమార్ సైన్స్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాలప్రధానోపాధ్యాయురాలు మాధవి మంగళవారం తెలిపారు.సైన్స్ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడంపై విద్యార్థి ప్రశాంత్ కుమార్‌నుపాఠశాల సైన్సు ఉపాధ్యాయులు హేమలత, అనురాధతోపాటు ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేసిన దృశ్యం

**దామరగిద్ద, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త):** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో మంగళవారం దామరగిద్ద మండలం కానుకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మాసిక ధర్మం సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలు, పోషకాహారం గురించి వైద్యులు వివరించారు.అనంతరం పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థినులకుపరీక్ష ప్యాడ్‌లను పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డా. మల్లికార్జున్, కార్యదర్శి డా. ఆదిత్య గౌడ్, కోశాధికారి డా. గీత, జనరల్ ఫిజీషియన్ డా. కార్తీక్ గందే, డా. పద్మకళ, దీపికశెట్టి, అక్షిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నపూర్ణ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప దేవుని ఉత్సవాల్లో కౌకుంట్ల సర్పంచ్



**దేవరకద్ర, ఫిబ్రవరి24 (ప్రభాతవార్త):** కౌకుంట్ల మండల కేంద్రంలోని స్థానిక బీరప్ప దేవస్థానం వద్ద భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న బీరప్ప దేవుని ఉత్సవాల్లో పాల్గొన్న కౌకుంట్ల గ్రామ సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నరేష్ కుమార్ ప్రత్యేకపూజలు నిర్వహించి, గ్రామ ప్రజల సుఖశాంతి ఆయురారోగ్యాలు, పంటల సమృద్ధి కలగాలని ప్రార్థించారు. గ్రామ ఐక్యతకు ప్రతికగా నిలిచే ఈబీరప్ప స్వామి ఉత్సవాలు భక్తి, ఐక్యత ,సంస్కృతి,పరిరక్షణకు నిదర్శనంఅని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి కోసం రెవెన్యూ డిపార్ట్మెంట్ సహకరించాలి

### వివిధ అంశాలపై తహసీల్దార్‌తో చర్చిస్తున్న మీసాల రామన్న

**వీపనగండ్ల ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త):** వీపనగండ్ల మండల కేంద్రంలోని అన్యక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను రక్షించాలని, తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రామన్న కోరారు. మంగళవారం తహసిల్దార్ వరలక్ష్మిని తహసిల్దార్ కార్యాలయంలో కలిసి వివిధ సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా మీసాల రామన్న మాట్లాడుతూ ఊరు అభివృద్ధి కోసం, పార్టీలకు అతీతంగా నాయకులంతా కృషి చేయాలని అన్నారు.మరి అదేవిధంగా తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది కూడా ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామ అభివృద్ధి కోసం సహకరించాలని, ప్రజలంతా సంపూర్ణంగా మద్దతిస్తామని తెలిపారు. మరి అదేవిధంగా తహసిల్దార్ వరలక్ష్మి మాట్లాడుతూ,,,అక్రమంగా రోడ్డుపై ఇరువైపులా ఉన్న డబ్బాలను తొలగిస్తామని అన్నారు. గ్రామ ప్రజలందరూ అధికారులకు సహకరించాలని కోరారు. సర్వేనెంబర్ 721లో కబ్జాకు గురైన స్థలాన్ని రక్షించిన విషయం తెలిసిందే.

## పెద్దపల్లిలో బస్సు స్టాప్ దగ్గర పురాతన చింతచెట్టు కట్టకు మరమ్మత్తులు



**మల్దకల్ ఫిబ్రవరి 24. (ప్రభాతవార్త):** బస్ స్టాప్ దగ్గర ప్రజలు కోసం, స్కూల్ పిల్లలు కోసం కూర్చోడానికి ఇబ్బంది ఉంటే పురాతన చెట్టు కట్టకు గ్రామ పెద్దలు, గ్రామస్తులు సహకారం తో మరమ్మత్తులు చేయిస్తున్న సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి. పెద్దపల్లి గ్రామంను ఆదర్శ గ్రామం గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్,వార్డుమెంబర్స్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



ధ్వంసం అయిన రోడ్డు, డ్రైనేజీ

# బోరు బండి వెళ్ళింది..రోడ్డు కుంగింది!



**నవాబుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** బోరు బండి వెళ్లి సీసీరోడ్డు మురుగు కాలువ ధ్వంసం అయింది. వివరాల్లోకి వెళ్తే..మండల పరిధిలోని సౌటాపల్లిలో సీసీ రోడ్డు గుండా బోరు బండి వెళ్లడంతో డ్రైనేజీతో పాటురోడ్డు కూడా కొంత మేరకు ధ్వంసం అయింది.నాణ్యత లోపంతో సిసిరోడ్డు పనులు జరిగాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సీసీరోడ్డుతో పాటు డ్రైనేజీ కాల్వ కూడా కుంగడంతో ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.అధికారులు స్పందించి రోడ్డుతో పాటు డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఇసుక టిప్పర్, జేసీబీ సీజ్

**భూత్పూర్,ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న భూత్పూర్ మండలం కొత్తమొల్గర గ్రామ శివారులో టిప్పర్,జేసీబీని మంగళవారం భూత్పూర్ పోలీసులు సీజ్ చేశారు.ఇసుకను కొత్తమొల్గర వైపు వస్తున్న ఎపి16 టీజీ 7758 నెంబరు గల టిప్పర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా లోడ్‌చేసుకుని విక్రయించేందుకు టిప్పర్‌ను ఇందుకు ఉపయోగించిన టీఎస్05 ఎఫ్‌జి0061 నెంబరు గల జేసీబీని సీజ్ చేసినట్లు భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.డ్యూటీలోఉన్న తమ పోలీసులు బీట్ డ్యూటీ చేస్తుండగా,అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ ఇందుకోసం ఉపయోగించిన జేసీబీ రెండింటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## సంత స్థలం పేరిట దోపిడికి కుట్ర



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ప్రగల్భాలు పలికిన నాయకులు ఎక్కడని నిరంజన్‌రెడ్డి దుయ్యబట్టారు. భూసేకరణ పేరిట భారీ అవినీతికి, దోపిడికి కుట్ర. 30 ఎకరాల 19 గుంటల భూమి ఎటువంటి పరిహారం ఎవరికి ఇవ్వకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని సంతకు వినియోగిస్తామని కుర్చీ వేసుకొని ఒక్క నెలలో ప్రహరీ గోడ కడతామని ప్రగల్భాలు పలికిన రండ,అసమర్థ నాయకులు న్యాయస్థాన తీర్పుతో ఖంగుతిని ప్రజల ముందు అభాసుపాలు అవుతామని భూసేకరణ పేరిట భారీ దోపిడికి తెరలేపారని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం భూ యజమానులకు సంత స్థలంకు ప్రత్యామ్నయంగా మన జిల్లా సరిహద్దులు దాటి అత్యంత విలువైన భూమిని ఔటర్ రింగ్ రోడ్డు దగ్గరలో ఇప్పిస్తామని ఇందులో ముఖ్యమంత్రి సోదరుణ్ణి సహాయం తీసుకుంటున్నామని మీకిచ్చే భూమిలో సగం భూమి వారికి ఇవ్వాల్సి ఉంటుందని భూ యజమానులతో సంప్రదించడంతో వేల కోట్ల దోపిడికి కుట్ర చేశారని ఆరోపించారు. ఇంత అవినీతికి తెరలేపిన మీరు కబ్జాకోరులా ఎటువంటి ప్రతిఫలంఆశించకుండాఉన్నంతలో సంత స్థలాన్ని కాపాడాలనుకున్న నేను కబ్జాకోరునా... అని ప్రశ్నించారు. అకారణంగా ఆనాడు నాపై దుష్ప్రచారం చేసిన మీ పుట్టుకలో నైతికత ఉంటే మాకు ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి తదుపరి కార్యాచరణకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో వనంరాములు, దిలీప్‌రెడ్డి, కర్రెస్వామి, కౌన్సిలర్స్ సౌజన్యమన్యం,పెద్దింటివెంకటేష్,ఎం.రాజశేఖర్, విశ్వరూపం,ఎద్దుల సాయి, గోపి, సహదేవుడు, శేఖర్ గౌడ్, వడ్డే రమేష్, రామకృష్ణ, శంభు రాము, రాములు,భారతి, మాధవ్‌రెడ్డి, నరేష్,మొగిలన్న,అంజి, రాములు, పరమేశ్, అఖిల్,గిరి,వసంత్, సురేష్, శ్రీను,సోహెల్, మూర్తి, వేణు, ఉదయ్ పవన్, నరేందర్,నందిమల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## 14,857 బస్తాలు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

కోసం క్యూ లైన్‌లో పడి గాపులు కాయాల్సి వచ్చేదని ఇప్పుడు అలాంటి ఇబ్బందులు లేకుండా ఈ యూరియా యాప్ ద్వారా ఎక్కడైనా బుక్ చేసుకొని తెచ్చుకోవచ్చని వివరించారు. ఈ యాప్ వచ్చే సీజన్ లలో కూడా యూరియా యాప్ ద్వారా సరఫరా చేయాలని రైతులు కోరారు. జిల్లా వ్యవసాయఅధికారి బి.వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా ఎలాంటి కొరత లేదని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 14,857 బ్యాగ్ ల యూరి యా సరఫరాకు సిద్దంగాఉందన్నారు.అదే విదంగా జిల్లాలో ఇంతవరకు 82,670 మంది రైతులు3,09,670బుక్ చేసుకోగా3,07,550 యూరి యా బ్యాగ్ లను సరఫరా చేయటం జరిగిందని తెలియజేశారు. జిల్లాలో కౌలు రైతులు, ఆర్ఓఎఫ్ఆర్ రైతులుకూడా యాప్‌లో యూరియా పొంద వచ్చని తెలియ చేశారు.పారదర్శకంగానే కాకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు రైతులకు యూరియా సరఫరా యాప్ ద్వారా సరఫరా చేయటం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మహబూబ్‌నగర్ బి.రాంపాల్, వ్యవసాయ అధికారి మహబూబ్‌నగర్ అర్బన్ పి.శ్రీనివాసులు, ఎంఎస్ రాటి పర్టిలైజర్ డీలర్, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో రాణించాలి

(మొదటి పేజీ తరువాయి)



విజేతలు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా తమ లోపాలను సరిదిద్దుకొని మరింత కృషితో ముందుకు సాగాలని సూచించారు. జిల్లాకు కీర్తి తీసుకువచ్చిన క్రీడాకారులందరినీ ప్రత్యేకంగా అభినందించారు.

**విజేతలు వీరే..**

- మహిళల ఆర్మ్ రెజ్లింగ్ వెయిట్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ – అడ్డకల్ పోలీస్ స్టేషన్ మహిళా పీసీ 2405 రాధిక.
- బ్యాడ్మింటన్ 55+ ఏజ్ గ్రూప్ సింగిల్స్ డబుల్స్ – టూ టౌన్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ 1532 శేఖర్.
- బ్యాడ్మింటన్ 55+ డబుల్స్ – ఏఆర్ హెచ్‌సీ 2128 పురేందర్.
- బాడీ బిల్డింగ్ 90+లో సిల్వర్ లాన్ టెన్నిస్‌లో బ్రోంజ్ – ఏఆర్ హెచ్‌సీ 373 ఇమ్రాన్.
- స్విమ్మింగ్ 200 మీటర్స్ ఫ్రీ స్టైల్‌లో సిల్వర్, 200 మీటర్స్ ఇండివిడ్యువల్ 100 మీటర్స్ – బటర్‌ఫ్లైలో బ్రోంజ్ – ఏఆర్‌పీసీ 2758 బిక్షం.
- స్విమ్మింగ్ బ్రెస్ట్ స్ట్రోక్‌లో బ్రోంజ్ – ఏఆర్‌పీసీ 525 నర్సింహారెడ్డి.
- బాక్సింగ్‌లో బ్రోంజ్ – ఏఆర్‌పీసీ 2908 రఘునాయక్.
- టీమ్ ఈవెంట్‌లో బ్రోంజ్ – పీసీ 93 విష్ణువర్ధన్ రెడ్డి, భూత్పూర్ పీఎస్.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, రమణా రెడ్డి, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలి

**వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**గద్వాల ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు.పదో తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ అన్ని జిల్లాల కలెక్టర్లు పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్నాపత్రాలు పరీక్ష కేంద్రాలకు చేరే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్ కొరత లేకుండా చూసుకోవాలని, ఇతర మౌలిక వసతులన్నీ కల్పించాలని ఆదేశించారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ పాల్గొన్నారు. వీసి అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ పరీక్షలు జరిగే ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. విద్యార్థులతోపాటు పరీక్షల విధులు నిర్వర్తించే ఇన్విజిలేటర్లు, ఇతర అధికారులు ఎట్టి పరిస్థితుల్లో ఎలక్ట్రానిక్స్ వస్తువులు, సెల్ ఫోన్స్ పరీక్ష కేంద్రాలకు తీసుకు రాకూడదన్నారు. పరీక్షలు జరగడానికి గంట ముందేఆయా కేంద్రాల్లోని హాల్స్ ను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాథమిక చికిత్స, తాగునీరు, టాయిలెట్స్, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రెవెన్యూ , తపాలా, రవాణా, ఆర్టీసీ, ట్రెజరీ, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు కూడా తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలో పరీక్షలను విజయవంతం చేయాలని, ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఈవో విజయలక్ష్మి, డిఐఈఓ హృదయ రాజు, డిటిఓ వెంకటేశ్వరరావు, డిపిఓ శ్రీకాంత్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి , పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్

# 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

**- పియూ వీసీ జి.ఎన్. శ్రీనివాస్**

**మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి24 ప్రభాతవార్త:** పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దడం కాలానుగుణ అవసరమని, ఈ దిశగా రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రతి కళాశాల స్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ॥ జి.ఎన్. శ్రీనివాస్ పేర్కొన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం అకాడమిక్ ఆడిట్ సెల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో మంగళవారం మధ్యాహ్నం విశ్వవిద్యాలయం ఫార్మసీ ఆడిటోరియంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత గ్లోబల్ పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం సిద్ధాంతపరమైన జ్ఞానంతో మాత్రమే కాకుండా, పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక, ప్రవర్తనా, డిజిటల్ నాయకత్వ నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల ఉపాధి అవకాశాల విస్తరణే విశ్వవిద్యాలయ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్ బాబు మాట్లాడుతూ అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి కోసం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యా రంగంపరిశ్రమల మధ్య ఉన్నఅంతరాన్ని తగ్గించేందుకు స్థానిక పరిశ్రమలు, ఆసుపత్రులు, ప్రయోగశాలలు ఇతర సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవాలని సూచించారు.ఇంకానాక్ అక్రెడిటేషన్ దృష్ట్యా అవసరమైన డాక్యుమెంటేషన్, నాణ్యత ప్రమాణాలు, అంతర్గత నాణ్యత భరోసా వ్యవస్థ బలోపేతం సమగ్ర సన్నద్ధతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో అకాడమిక్ ఆడిట్ సెల్ సంచాలకులు డా.చంద్రకిరణ్ కార్యాచరణ ప్రణాళిక వివరాలను తెలియజేశారు. కార్యక్రమం లో ప్రభుత్వ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాల్స్, వివిధ కాలేజీల కోఆర్డినేటర్లు, అకాడమిక్ ఆడిట్ సెల్ సమన్వయకర్తలు డా. రవి కుమార్, డా. సిద్ద రామగౌడ్, డా. సుజాత, సపోర్టింగ్ స్టాఫ్ రమేష్, జానవి, బాలిక్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్

# సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన

**పసిపాప మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి : చిన్నంబావి సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్**

**చిన్నంబావి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామ జాతరలో అగ్రకుల పెత్తందారుల కుల దురహంకారుల దాడుల వల్ల మరణించిన చిన్నారి మృతికి కారణమైన వారినందరినీ అరెస్ట్ చేయాలని,బాధితులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సిపిఎం పార్టీ చిన్నంబావి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ నాగర్ కర్నూలు జిల్లాలో అగ్రకుల పెత్తందారుల దాడిలో మరణించిన కుటుంబనికి న్యాయం చేయడంలో స్థానిక ఎమ్మెల్యే,అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదన్నారు.సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్న పోలీసు శాఖ అగ్ర కుల పెత్తందారులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దాడి చేసిన వ్యక్తులు అధికార పార్టీ కి చెందిన వారు కావడంతో వారిని రక్షించేందుకు పోలీసు శాఖ అన్ని రకాల ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. కుల దురహంకారుల దాడులు ఎన్నటికీ క్షమించరాదని బాధితులకు అండగా అన్ని వర్గాల ప్రజలు ఉన్నారని అన్నారు. ఘటనకు కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేసి, వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పి వెంకటస్వామి, ఎస్. రాములు, ఎం.వెంకటస్వామి, శివ, పి.రాములు, జి.రాముడు, చిన్న బాలస్వామి, పరుశురాముడు తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతున్న దృశ్యం

# ఇంటర్, పది పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేయాలి

**వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశం**

**వనపర్తి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** జిల్లాలో ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హైదరాబాద్ నుంచి, ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలిసి, అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీతరెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగాపూర్తి చేయాలని కలెక్టర్‌లకు సూచించారు. పరీక్షల నిర్వహణపై పలు అంశాలను చర్చించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా, పరీక్షల సమయాలకు అనుగుణంగా బస్సులననడపాలని ఆదేశించారు. పరీక్షలు జరుగుతు న్నంతసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ దుకాణాలు మూసివేసి, బిఎన్ఎస్ సెక్షన్ 163 (సీఆర్పీసీ 144) అమలు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణపై వివరాలను జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, ఇప్పటికే ఇంటర్ పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధితశాఖల అధికారులతో సమన్వయ సమావే శాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహిం చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.ఇంటర్మీడియట్‌కు సంబంధించి బుధవారం నుంచి జిల్లాల్లో మొత్తం 12,653 మందివిద్యార్థులు హాజరువుతున్నట్లు తెలిపారు.వారిలో ప్రథమ సంవత్సరం 6,216 మంది విద్యార్థులు, 6,437 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 25పరీక్షా కేంద్రాల్లో పరీక్షలురాయనున్నారని అన్నారు. పదవ తరగతి పరీక్షలకుసంబంధించి మార్చ్ 14వ తేదీ నుంచి, ఏప్రిల్ 16 వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి, 12.30 వరకు, 37 పరీక్షా కేంద్రాల్లో మొత్తం7, 228 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని రకాలుగా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎలాంటి లోటు పాట్లకు తావు ఇవ్వొద్దని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద, ప్రశ్న పత్రాల తరలింపు సమయంలో పటిష్ట పోలీసు బందోబస్తుఏర్పాటు చేయాలనిసూచించారు. పరీక్షలు జరుగుతున్నతసేపు విద్యుత్ సరఫ రాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని వివరించారు.పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ దుకాణాలు మూసివేసి, బిఎన్ఎస్ సెక్షన్ 163 (సీఆర్పీసీ 144) అమలు చేయాలని అన్నారు. అన్నిపరీక్షా కేంద్రాలలో త్రాగునీరు, విద్యార్థులకు సౌకర్యవంతమైన బెంచీలు,సరైన లైటింగ్,సిబ్బందితో కూడిన వైద్య శిబిరం,తదితర అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యా ర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా, పరీక్షల సమయాలకు అనుగుణంగా బస్సులను నడపాలని పేర్కొన్నారు. ఎటువంటిఅవాంఛనీయ ఘటనలుజరుగకుండా, పారదర్శకంగా పరీక్షలను పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి అంజయ్య, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.





వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హాజరైన జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 1నుండి జనవరి 31,2026 వరకు జిల్లా స్థాయిలో బాల కార్మికుల నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ స్మైల్ 12 క్రింద 77 పిల్లలను రక్షించినట్లు తెలిపారు. 2019 నుండి 2025 వరకు జిల్లాలో మొత్తం 2323 పిల్లలను రక్షించి, పునరావాసం,విద్య మరియు ఇతర అవసరాలను కల్పించామని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు లేదా బాల్య వివాహాలు జరిగితే వెంటనే డయల్ 100,1098 ఇతర సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందిన వెంటనే పోలీసులు తప్పనిసరిగా సంఘటనా స్థలానికి చేరుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.మిషన్ వాత్సల్య పథకం 2020 నుండి 2025 వరకు 217 మంది ఆర్ఫన్లు (అనాధలు), కోవిడ్/సెమీ ఆర్ఫన్లు,దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఉన్న పిల్లలకు మొత్తం ఆర్థిక సహాయం ..1,47,68,000/ అందించడం జరిగిందన్నారు.పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి, బాధితులకు పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకువిద్యా, ఆరోగ్యం అందించి సమాజంలో వారిని అభివృద్ధిపథంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు.జిలాల్లో ప్రతి నెల 10 రోజులకుపైగా విద్యార్థులు పాఠశాలకు హాజరు కాకపోతే, సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే సీడీపీఓలకు సమాచారం అందించాలని,ఆ వివరాలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పరిశీలించి పిల్లల తండ్రి తండ్రులకు కౌన్సిలింగ్ చేసి పట్టి పిల్లలను తిరిగి పాఠశాలకు చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు/ జనన సర్టిఫికేట్ వచ్చేలా చర్యలు తీసుకోవాలనిఆదేశించారు. బాలలహక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అధికారులు అందరూ సమన్వయంతో పనిచేస్తే బాల్య వివాహాలు, బాల్య కార్మిక వ్యవస్థలను పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు,అడిషనల్ ఎస్పీ శంకర్, జిల్లా శిశుసంక్షేమ శాఖ అధికారిని సునంద,డీఈఓ విజయ లక్ష్మి,చైల్డ్ వెల్ ఫేర్ చైర్ పర్సన్ సహదేవుడు,జిల్లా అధికారులు, డిసిపిఓ నరసింహులు, ఎన్.జీ.ఓలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

## కంటి పరీక్ష శస్త్ర చికిత్స విజయవంతం

**లయన్స్ క్లబ్ ఆఫ్ జడ్చర్ల ఆధ్వర్యంలో నిర్వహణ**



కంటి పరీక్ష శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

**జడ్చర్ల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** జడ్చర్లలోని లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శస్త్ర చికిత్స శిబిరం విజయవంతం అయింది. ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేంద్ర కుమార్ రెడ్డి, జడ్చర్ల మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, లయన్స్ క్లబ్ జడ్చర్ల చార్టర్ ప్రెసిడెంట్ డా.రామిరెడ్డి కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో 600 మందికి పైగా కంటిపరీక్షలు నిర్వహించి 360 మందికి కళ్ళద్దాలు పంపిణీ చేశారు.80మందికి శాస్త్ర చికిత్స ఈవారం లోపు పూర్తి ఉచితంగా నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జడ్చర్ల అధ్యక్షులు ధ్రువ బాదిమి,సెక్రటరీ కాల్వ రామిరెడ్డి, కోశాధికారి కొండూరి వెంకటేష్ తో పాటు క్లబ్ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

## ఉద్యోగ,ఉపాధ్యాయులకు తక్షణమే మెరుగైన పీఆర్సీ అమలు చేయాలి

**◆ పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్**



**మహబూబ్‌నగర్ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** ఉద్యోగ ,ఉపాధ్యాయులకు రావలసిన పిఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని సమంజసమైన ఫిట్మెంట్ 2023 జులై 1 నుండి అమలు చేయాలని పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2024 మార్చి నుండి రిటైరైన ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, డిఏవాయిదాలను విడుదల చేయాలని కోరారు.నూతన రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 కి అనుగుణంగా ఉపా ధ్యాయుల సర్వీసు నిబంధనలను రూపొందించి డిఈఓ, డిప్యూటీ ఇఓ, ఎంఈఓ తదితర పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయడం ద్వారా విద్యాశాఖలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలని కోరారు. టెట్ మినహాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అర్హత మార్కులను తగ్గించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరారు. పెండింగ్ డిఏలువెంటనే చెల్లించాలని,పిఆర్‌సి వెంటనే ప్రకటించాలని, ఉద్యోగంలో కొన సాగుటకు టెట్ ఉండాలనడం అసంబద్ధమని, జిఓ 25 ని సవరించి పిఎస్‌హెచ్‌ఎం పోస్టులుమంజూరు చేసి భర్తీ చేయాలని,బదిలీలు, పదోన్నతులు వేసవి సెలవుల్లో చేపట్టాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**జడ్చర్ల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** జడ్చర్ల మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన దళితులు దుబ్బా నవీన్ (30 )ఎడ్ల యాదగిరి (26) ఇద్దరు గ్రామ శివారులోని కోపికుంట చెరువులో ఈతకువెళ్లి గల్లంతయ్యారు. నేటికి వారి ఆచూకీ లభ్యం కాకపోవడంతో బిఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంఘటన జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య, ముడా మాజీ డైరెక్టర్స్ ఇంతియాజ్ ఖాన్, ఎంబి శ్రీకాంత్, బిఆర్ఎస్ కార్యదర్శి గిరియాదవ్, శ్రీను నాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు తో మాట్లాడారు. యువకుల ఆచూకీ కొరకు డ్రోన్ ద్వారా ప్రయత్నం చేయాలని కోరారు. అనంతరం దుబ్బా నవీన్ సతీమణి లక్ష్మమ్మకు ధైర్యం చెప్పారు.

## భక్తిశ్రద్ధలతో బీరప్ప దేవుని ఉత్సవాలు

**దేవరకద్ర, ఫిబ్రవరి24 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలోని స్థానిక బీరప్ప దేవస్థానం వద్ద భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న బీరప్ప దేవుని ఉత్సవాల్లో పాల్గొన్న కౌకుంట్ల గ్రామ సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నరేష్ కుమార్ ప్రత్యేకపూజలు నిర్వహించి, గ్రామ ప్రజల సుఖశాంతి ఆయురారోగ్యాలు, పంటల సమృద్ధి కలగాలని ప్రార్థించారు.ఈగ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.